క్లుప్తంగా

నేడు అన్నవరంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద విలేజ్ క్లినిక్ వద్ద ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముసల్‌రెడ్డిపల్లెలో వైభవంగా పీర్లపండుగ



ముసల్‌రెడ్డిపల్లెలో పీర్ల పండుగ

పోరుమామిళ్ల : మండలంలోని ముసల్‌రెడ్డిపల్లెలో ఆదివారం పీర్ల పండుగ వైభవంగా జరిగింది. పీర్ల పండుగ ముగింపు సందర్భంగా పీర్లు నీళ్ల వడేందుకు వెళ్లే ఘట్టాన్ని చూచేందుకు చుట్టుపక్కల పల్లెల జనం వచ్చారు. పండుగను హిందూ, ముస్లింలు ఐక్యంగా నిర్వహించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మాబు, భాస్కర్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి 'కడుపాత్రం' సంపుటి అందజేత



కథల సంపుటిని అందజేస్తున్న తవ్వా ఓబుల్ రెడ్డి

మైదుకూరు : తన 'కడుపాత్రం మరో పద్దెనిమిది కథలు' అనే కథా సంపుటిని మైదుకూరుకు చెందిన ప్రముఖ కథ రచయిత, చరిత్రకారుడు తవ్వా ఓబుల్ రెడ్డి, స్థానిక శాఖా గ్రంథాలయానికి ఆదివారం వితరణగా అందించారు. గ్రంథాలయ నిర్వాహకుడు సందీప్‌కుమార్ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. తవ్వా ఓబుల్ రెడ్డి రచించిన గండికోట చరిత్ర, తెలుగు పౌరుషం, కడప కథ పుస్తకాలను కూడా గతంలో ఆయన గ్రంథాలయానికి అందజేశారు.


తిరుమలకు వెంకటేశ్వరస్వామి భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న వెంకటేశ్వరస్వామి భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ లలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఆదివారం 10 మంది వెంకటేశ్వరస్వామి భక్తులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ధారా సంతోష్ కుమార్, పోలేపల్లి రాజాబాబు, నరేష్‌కుమార్, సురేష్, నాగేంద్ర, రాజేష్, నరసయ్య, సుధాకర్ రాజు, శ్రీనివాస్, రాము తదితరులు తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. వీరు ఐదు రోజుల పాటు పాదయాత్ర చేసి శుక్రవారం తిరుమల చేరుకుని వెంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



లక్షుమ్మ (ఫైల్)

గోపవరం : మండలంలోని ఎస్.రామాపురం మాజీ సర్పంచ్ బండారులక్షుమ్మ (45) గుండెపోటుతో మృతిచెందారు. ఇటీవల గుండె నొప్పితో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలు ఎస్.రామాపురం దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

విద్యుత్ ఉద్యోగుల ముందస్తు అరెస్టులు

కడప కార్పొరేషన్ : తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 8వ తేది ఛలో విజయవాడ కార్యక్రమానికి హాజరు కాకుండా విద్యుత్ ఉద్యోగులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. ఈ నిరసనలకు, ఆందోళనలకు ప్రభుత్వ అనుమతి లేనందున ముందస్తు అరెస్టులు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే సీఎం ధ్యేయం

మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మెప్మా అర్బన్ మార్కెట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. ఆదివారం మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాల ద్వారా సున్నా వడ్డీకే రుణాలను మంజూరు చేస్తూ, వారు వ్యాపారులుగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తాము పొదుపు చేసే సొమ్ముకు తోడు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో చిరు వ్యాపారాలతో మొదలు పెట్టి మార్టుల వరకు ఎదుగుతున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం వల్ల రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని సీఎం వైఎస్ జగన్ నమ్ముతున్నారన్నారు. అందుకే రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు, పక్కా ఇల్లు, నామినేటెడ్ పదవులు మహిళలకే కేటాయిస్తున్నారని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌లో మహిళలు తాము తీసుకున్న రుణాలతో తయారు చేసిన గృహోపకరణాలు, వస్త్రాలు, జూట్ బ్యాగ్‌లు, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, ఆహార పదార్థాలు, పచ్చళ్లు, అప్పడాలు, ఫినాయిల్, ఇంటికి ఉపయోగపడే సామాన్లను స్టాళ్లలో ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మహిళల కృషిని అభినందించారు. నాణ్యమైన వస్తువులను సైతం తక్కువ ధరకు విక్రయించేందుకు అర్బన్ మార్కెట్లు ఎంతో అనువుగా ఉంటాయన్నారు. ప్రజలు మెప్మా అర్బన్ మార్కెట్‌లో వస్తువులను కొనుగోలు చేసి స్వయం సహాయక సంఘాల మహిళల స్వావలంబనకు తోడ్పాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేవీ లింగన్న, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, మెప్మా టీఈ మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, దువ్వూరు మాజీజెడ్పీటీసీ గుడిపాడు బాబు, కూనెట్టి రాయుడు, భూమిరెడ్డి ఉబ్బరాయుడు మెప్మా సీఓలు పుల్లయ్య, రమణమ్మ, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు సూర్య నాగమ్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్ భవనాలు ప్రారంభం

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు పంచాయతీలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను సోమవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిచే ప్రారంభించనున్నట్లు మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

వైభవంగా హుసేన్‌పీర్ దర్గా ఉరుసు



ఉరుసులో భాగంగా ఊరేగింపుగా గంధం తీసుకువస్తున్న స్వామి వారసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గావీధిలో వెలసిన హుసేన్ పీర్ దర్గా 198వ ఉరుసు మహోత్సవాలు స్వామి వారసులు దర్గారహమతుల్లా సాహెబ్, దర్గా షఫీవుల్లా సాహెబ్ ఆధ్వర్యంలో రెండవ రోజైన ఆదివారం ఘనంగా జరిగాయి. ఉరుసు సందర్భంగా బద్వేలు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భారీగా భక్తులు తరలిరావడంతో దర్గా ఆవరణమంతా భక్తులతో కిక్కిరిసింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామి వారసులు గంధం ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి స్వామి మజార్లకు ఎక్కించి అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఆవరణలో మొక్కుబడి ఉన్న భక్తులు అన్నదానం నిర్వహించారు. చివరిరోజు కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉరుసు సందర్భంగా రాత్రి ఏర్పాటు చేసిన ఖవ్వాలి విశేషంగా ఆకట్టుకుంది. అలాగే పకీరుల విన్యాసాలు అబ్బురపరిచాయి. స్వామి వారసులు దర్గామహమ్మద్ కరీముల్లా, దర్గామున్వర్, దర్గానలీం, ఆర్గనైజర్లు అన్వర్‌బాషా, సిమెంట్ షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

భగవద్గీత అందించిన శ్రీకృష్ణుడే నిజమైన స్నేహితుడు



భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

అట్లూరు : భగవద్గీత బోధించిన శ్రీకృష్ణ భగవానుడే మనకు నిజమైన స్నేహితుడు అని త్రైతసిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ అధ్యక్షులు జి.ప్రసాద్ పేర్కొన్నారు. హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని యర్రబల్లి కాలనీ, బీసీసాహెబ్‌పేట, తంబళ్లగొంది, గుజ్జులవారిపల్లె గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి పలువురికి భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిగురువుగా శ్రీకృష్ణుని జీవన విధానం లోకానికి ఒక ప్రామాణికమని అన్నారు. ధర్మం విలువ తెలుపుటకు, ధర్మం పక్షాన నిలబడేందుకు వయోపరిమితి అడ్డు కాదని చాటిన ధర్మశీలి శ్రీకృష్ణుడు అని అన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక సభ్యులు జి.సుధాకర్, కె.వెంకటేశ్వరరెడ్డి, కె.నరసింహులు, వై.మహేంద్ర, ఎస్.కె.సలీం, కె.భరత్‌కుమార్, డి.రమణయ్య, ఎం.నాగమ్మ, యు.రత్నమ్మ, డి.రమణమ్మ, యు.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : విప్లవకవి, ప్రజా గాయకుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బి.సి.రమణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బి.గురుమూర్తిలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బీసీ చైతన్య సమితి కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం, పీడిత వర్గాల కోసం పాటుపడిన అరుదైన ఉద్యమ నాయకుడు గద్దర్ అని అన్నారు. గద్దర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, రమేష్, ఆర్టీసీ యూనియన్ నాయకులు జయరాం, ప్రజాకవి వర్మ, దళిత నాయకులు పిచ్చయ్య, ఓ.ఎస్.వి.ప్రసాద్, మైనార్టీ నాయకులు గౌస్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ప్రెస్‌క్లబ్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా టి.ఉదయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడు, కోశాధికారి పదవులకు ఎన్నికలు జరిగాయి. అధ్యక్షునిగా నరేంద్ర, కోశాధికారిగా ఎ.పవన్ ఎన్నికలయ్యారు. ఎన్జీఓ అసోసియేషన్ కార్యదర్శి రామసుబ్బయ్య యాదవ్ ఎన్నికల అధికారిగా, విశ్రాంత ఉద్యోగి వెంకటరామయ్య ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలుగురాళ్లపల్లె, ఎస్సీ కాలనీ, కొత్తపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతున్నారని, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

బ్రహ్మంగారిమఠం : మండల సర్వసభ్య సమావేశం సోమవారం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షత నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారని, మండల అధికారులు అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందాం



పాతబస్టాండులోని జ్యోతిరావు పూలేసర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రధాని మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందామని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పాతబస్టాండు వద్ద ఉన్న జ్యోతి రావు పూలే సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన ఛలో విజయవాడను జయప్రదం చేయాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 9న విజయవాడ నగరంలో నిర్వహించే నిరసనను కార్మికులు, కర్షకులు జయప్రదం చేయాలని కోరారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలను మోపుతూ కార్మికులను బానిసలుగా మార్చేందుకు 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చిందన్నారు. మూడు వ్యవసాయ కార్మిక చట్టాలను తీసుకువచ్చి రైతాంగ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ, ఎల్‌ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేట్ దోపిడీదారులకు ఇచ్చేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. మోడీ ఎనిమిది సంవత్సరాల కాలంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూత పడ్డాయని వీటిలో పని చేసే లక్షలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మద్దిలేటి, సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, చంద్రారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

9న నిరసనను జయప్రదం చేయాలి

ఈ నెల 9న క్విట్ కార్పొరేట్, దేశ్ బచావో పేరుతో కడప నగరంలోని బీఎస్ఎన్ఎల్, తపాలాశాఖ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని ఏపీ రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

బాధ్యతలు స్వీకరించిన 'బ్రౌన్' సంచాలకుడు



బ్రౌన్ కేంద్రం నూతన సంచాలకుడిని సన్మానిస్తున్న సిబ్బంది

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నూతన సంచాలకునిగా యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యుడు తప్పెట రామప్రసాద్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పూర్వ సంచాలకుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, కేంద్రం సిబ్బంది నూతన సంచాలకుడిని ఘనంగా సత్కరించి, ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆచార్య రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల తెలుగు సంఘాలతో ఎంఓయూ చేసుకుని బ్రౌన్ కేంద్రం ద్వారా సాహిత్యకృషి చేస్తామన్నారు. ఈ కేంద్రంలో పటిష్టమైన భద్రత, రక్షణ, శుభ్రత, పచ్చదనంతో సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. పాఠకుల కనీస అవసరాలపై శ్రద్ధ చూపుతామని తెలిపారు. అనంతరం పూర్వ సంచాలకుడు మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ కేంద్రం అభివృద్ధికి తమవంతు కృషిచేశామని, నూతన సంచాలకుడు కేంద్రం అభివృద్ధి పట్ల తన ప్రణాళికను స్పష్టంగా తెలిపారని ఆయన ఆధ్వర్యంలో కేంద్రం మరింత ఉన్నతస్థితికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సలహామండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్, మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావులు నూతన సంచాలకుడిని సత్కరించారు. కార్యక్రమంలో బ్రౌన్ పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, లైబ్రరీ అసిస్టెంట్లు ఎస్. రమేష్‌రావు, హరిభూషణ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్. వెంకటరమణ, మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్, చంద్రకిశోర్, సుబ్రమణ్యం, రాజి పాల్గొన్నారు.

నేడు నగరానికి 2వ జాన్‌పాల్ అవశేషాలు



మాట్లాడుతున్న చర్చి ఫాదర్లు

కడప కల్చరల్ : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త 2వ జాన్‌పాల్ పోప్ స్మారక అవశేష పార్థివదేహాన్ని సోమవారం సాయంత్రం కడప నగరం మరియాపురం చర్చి వద్దకు చేర్చనున్నట్లు ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ తెలిపారు. ఆరోగ్యమాత క్షేత్రంలో వారు ఆదివారం విలేకరులకు ఈ విషయం తెలిపారు. రోమన్ క్యాథలిక్ క్రైస్తవ మతాధిపతి పునీత 2వ జాన్‌పాల్ పోప్ 27 సంవత్సరాల పాటు ప్రపంచమంతటా క్రైస్తవ సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపించి 2005లో తనువు చాలించారన్నారు. 9 సంవత్సరాల తర్వాత 2014 ఏప్రిల్ 27న వాటికన్‌సిటీ ఆయనను పునీతునిగా ప్రకటించిందన్నారు. ఆయన అవశేషాలను జీసెస్ యూత్ ఆధ్వర్యంలో ప్రపంచమంతా సకలజాతిజనులకు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు మరియాపురం సెయింట్ మేరీస్ కేథిడ్రల్ చర్చికి చేరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహిస్తామన్నారు. ఆయన స్మారక పార్థివ దేహాన్ని చూసే అవకాశం విశ్వాసులకు అరుదైనదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



మొదటి మూడుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఆదివారం నిర్వహించిన అష్రఫ్-ప్రసన్న మంత్లీ రోలింగ్ షీల్డ్ చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో జాఫర్ విజేతగా నిలువగా, రెండో స్థానంలో లిఖిత్, మూడో స్థానంలో గుణవర్ధన్ నిలిచారు. తర్వాత స్థానాల్లో చిన్మయ్, యాఫియా, రెడ్డివస్, ఉమాదేవి, ఇనోక్, వంశీకృష్ణ, తేజోమయి నిలిచారు. వీరికి జిల్లా చదరంగం అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, తబస్సుమ్ పాల్గొన్నారు.

డీఈఓపై విచారణ చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు, అక్రమ డిప్యుటేషన్లు, అక్రమ వర్క్ అడ్జస్ట్‌మెంట్లు, అక్రమ పదోన్నతులపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని సర్వేపల్లి రాధాకృష్ణ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్పీ గంగరాజు కోరారు. ఆదివారం వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురికాకుండా డీఈఓను పదవి నుంచి తప్పించి విచారణ జరపాలన్నారు.

మాజీ మంత్రి మైసూరారెడ్డి ప్రత్యేక పూజలు

కమలాపురం: మాజీ మంత్రి మైసూరారెడ్డి సీతా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. మండలంలోని కొండాయపల్లెలో ఇటీవల నూతనంగా నిర్మించిన సీతారామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలకు రాలేని కారణంగా ఆయన ఆదివారం రాత్రి ఆలయానికి విచ్చేశారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అసంబద్ధంగా ముఖ ఆధారిత హాజరు నిబంధనలు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు నిబంధనలు చాలా అసంబద్ధంగా, మానసికంగా ఒత్తిడికి గురి చేసే విధంగా ఉన్నాయని ఏపీ ఎస్‌టీఎఫ్ జిలా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రామచంద్ర పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఏపీ ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉదయం 8.45 గంటలకు పాఠశాలకు వెళ్లి హాజరు ఆన్‌లైన్ వేసినప్పటికీ కొన్ని సందర్భాల్లో సాంకేతిక లోపంతో 9 గంటల తర్వాత ముఖ ఆధారిత హాజరు నమోదవుతోందన్నారు. 9 గంటలు దాటిన తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా వారిని సెలవులో ఉన్నట్లు ప్రకటిస్తామని అధికారులు పేర్కొనడం శోచనీయమన్నారు.

వైవీయూ ఉర్దూ విభాగానికి ప్రొఫెసర్ పోస్టులను మంజూరు చేయండి



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న రూటా నాయకులు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ ఉర్దూ విభాగానికి ప్రొఫెసర్ల పోస్టులను మంజూరు చేయాలని రూటా లెక్చరర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వసి ఉల్లా సాహెబ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్తార్‌ఫైజీలు కోరారు. ఈ విషయమై ఆదివారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు తమ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 2017 సంవత్సరం నుంచి కేవలం కాంట్రాక్టు లెక్చరర్లతోనే బోధన సాగిస్తున్నారన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ త్వరలో పోస్టుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూటా సమన్వయకర్త మొహమ్మద్ అయూబ్, డైరీ కమిటీకో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, అకడమిక్ విభాగం రాష్ట్ర కన్వీనర్ మస్తాన్‌వలి, నాయకులు సర్దార్ మైనుద్దీన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుందూనది విస్తరణ పనులు



అల్లాడుపల్లె వద్ద కుందూనదిలో జరుగుతున్న విస్తరణ పనులు



కుందూ పరీవాహంలో పూడిక తీత మట్టిని డంప్ చేస్తున్న దృశ్యం

చాపాడు : ఏటా అధిక వర్షాలు సమయంలో వరదలు పోటెత్తి సమయంలో కుందూనది ఇరువైపులా తీర పంట పొలాలు, గ్రామాలు వరదలో చిక్కుకుని తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొనేంది. ఇలాంటి పరిస్థితులు రాకూడదనే ఉద్దేశంతో శాశ్వత పరిష్కారం కోసం గతేడాది ప్రభుత్వం కుందూనది ఆధునికీకరణ చేపడుతూ విస్తరణ పనులు చేస్తోంది. కర్నూలు జిల్లా నుంచి వైఎస్సార్ కడప జిల్లాలోని వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె వరకూ కుందూనది విస్తరణ చేసేందుకు గతేడాది 183 కి.మీ లక్ష్యంతో రూ.1350 కోట్లతో పనులు మొదలుపెట్టారు. 35వేల క్యూసెక్కుల సాగునీరు ప్రవాహ సామర్థ్యానికి వీలుగా విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా సివిల్ వర్క్స్‌కు రూ.1286 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఎక్కువ భాగం మట్టి పనులు, ఆయా గ్రామాలకు హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకూ చేపట్టిన పనులలో సుమారు రూ.200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు పనులు నిలిపేయగా మరి కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయి. కుందూనది విస్తరణలో పూడిక తీసే మట్టిని నదికి ఇరువైపులా కట్టలుగా పోయటంతో పాటు మిగిలిన మట్టిని డంప్ చేస్తున్నారు. ఇదే క్రమంలో నది పరీవాహక ప్రాంతాల్లోని రైతుల అభ్యర్థన మేరకు పూడిక తీత మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లతో పొలాలకు తోలుతున్నారు. ప్రస్తుతం నదికి ఎడమవైపున అల్లాడుపల్లె సమీపంలో కుందూనది విస్తరణ పనులు జరుగుతున్నాయి.